


2లో

## శ్రీశైలం డ్యాం..3 గేట్లు ఎత్తివేత

RK అగ్ని న్యూస్
The Power Of Truth
9441533080 - 8309890844
జులై : 30 మంగళవారం సంపుటి : 28 సంచిక : 181

### మెటల్ రోడ్డు నిర్మాణంలో

# అవినీతి అనకొండలు






- ఉపాధి హామీలో విచ్చలవిడి గా అక్రమాలు
- చేతివాటం చూపించిన ఆడిటింగ్ అధికారులు
- తమ సంగతి ఏందంటున్న క్వాలిటీ కంట్రోల్ అధికారులు

(అగ్ని ప్రతినిధి, మార్కాపురం) పేదవాడికి కడుపునిండా అన్నం పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తుంది. ఏడాదిలో కనీసం వంద రోజులైనా పని కల్పించి నాలుగు మెతుకులు నోట్లోకి పోయేందుకు ఈపథకం పని చేస్తుందనేది కేంద్ర పెద్దల లెక్క. అయితే మన రాష్ట్రంలో జాతీయ ఉపాధి హామీ పథకం అవినీతి అనకొండలకు పట్టుకొమ్మగా మారింది. జిల్లా స్థాయిలో పిడి దగ్గర నుండి గ్రామస్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్ ల వరకు ఎక్కడ చూసినా అక్రమాల విక్రమార్కులే దర్శనమిస్తుంటారు.ఒకటి కాదు రెండు కాదు ఏ మండలం చూసినా,ఏపని చూసినా పని జరిగేది 40 శాతం కూడా ఉండదు, మిగతా 60 శాతం అవినీతి వ్యవహారాలే. ఉపాధి హామీ పనుల పైన ఆడిటింగ్ కూడా జరుగుతుంది. ఈ ఆడిటింగ్ అధికారులు అవినీతికి నిఖార్సైన అంబాసిడర్లుగా వ్యవహరిస్తుంటారు. మీ లెక్కల బొక్కలు బయట పెట్టకుండా ఉండాలంటే మా వాటా మాకు ఇవ్వండి అంటూ చాలా 2లో

## లారీ ఢీ కొని వృద్ధుడు మృతి



అగ్ని న్యూస్,పొదిలి: మండలంలోని పోతవరం వద్ద సోమవారం రోడ్డు ప్రమాదం జరిగింది.టిప్పర్ లారీ ఢీ కొనడంతో కంబాలపాడు గ్రామానికి చెందిన తిరుమలశెట్టి వెంకటేశ్వర్లు(70) అనే వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

## కలెక్టరమ్మ కనికరించు...!

### - గుక్కెడు నీళ్లు ఇవ్వండి..మా గొంతులు ఎండి పోతున్నాయి...!



అగ్ని న్యూస్,ఎర్రగొండపాలెం : ఎర్రగొండపాలెం మండలంలోని గుర్రపుశాల పంచాయతీలోని ఎస్సీ కాలనీ జనం తాగునీటి కోసం తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. నీటి కోసం పొలాల కు వెళ్తున్న వైనం కనిపిస్తుంది. మహిళలు, పిల్లలు, వృద్ధులు గుక్కెడు నీళ్ల కోసం కూలి పని వదిలేసి తాగునీటి కోసం పరుగులు తీస్తున్న పరిస్థితి కనిపిస్తుంది. ఎస్సీ కాలనీ లో ఒక్క బోరు ఉన్న అవి భూగర్భ జలాలు అడుగంటిపోయి పూర్తిగా నీళ్లు రావడమే ఆగిపోయినవి.గ్రామం మధ్యలో చర్చి దగ్గర ఉన్న ఆ బోరు లో నుండి సన్నగా గంటకు రెండు బిందెలు మాత్రమే వస్తాయి అని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తాగునీటి కోసమే గ్రామంలో గొడవలు కూడా జరుగుతున్నాయని మహిళలు అన్నారు. పంచాయతీకి సంబంధించిన వారు ట్యాంకర్లు నీళ్లు కూడా 2లో

## శ్రీశైలం డ్యాం..3 గేట్లు ఎత్తివేత

అగ్ని న్యూస్,శ్రీశైలం: శ్రీశైలం జలాశయానికి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో శ్రీశైలం ప్రాజెక్ట్ మూడు గేట్లు ఎత్తివేసి, సాగర్ కు నీరు వదులుతున్నారు. శ్రీశైలం ప్రాజెక్ట్ 3 గేట్లు 10 అడుగుల మేర ఎత్తివేశారు. 6, 7, 8 గేట్ల ద్వారా 81 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. ఒక వైపు తుంగభద్ర డ్యాం నుంచి, జూరాల ప్రాజెక్టు నుంచి భారీగా నీరు విడుదల చేశారు. శ్రీశైలం డ్యాం వద్ద 3 గేట్లు ఎత్తి నీరు కిందకు వదలడంతో పర్యాటకులు డ్యాం సందర్శనకు పోటెత్తారు.

## మెటల్ రోడ్డు నిర్మాణంలో అవినీతి అనకొండలు

మొండిగానే డబ్బులు వసూలు చేస్తుంటారు. వారికి లెక్కలు అప్పగిస్తే అంతా బాగుందని సర్టిఫై చేస్తారు. లేదంటే క్వాలిటీ కంట్రోల్ కు సిఫారసు చేస్తూ ఆ పనికి కాస్త బ్రేకులు వేస్తారు. ఇక క్వాలిటీ కంట్రోల్ అధికారులు కూడా తక్కువ ఏం తినరు, మరి మా సంగతి ఏందంటూ తిష్ట వేసి కూర్చుంటారు. వారికి కూడా ముట్ట చెబితే నేఆ పని సజావుగా ముగుస్తుంది, బిల్లులవుతాయి. లేదంటే ఆ పనిపెండింగ్లో పడిపోతుంది. ఇది ఆంధ్రప్రదేశ్లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం బాగోతం.ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం నియోజకవర్గం. వెనుక బడిన ఈ ప్రాంతంలో ఉపాధి హామీ పథకం జనాలకు కాస్తా ఊరట ఇస్తుందని భావిస్తాం. అయితే ఈ నియోజకవర్గంలో ఉపాధి హామీలో జరిగిన అవినీతి, జిల్లాలో మరెక్కడ జరగలేదంటే అతిశయోక్తి ఏమీ కాదు. గతంలో ఈ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన ప్రజా ప్రతినిధి హస్తం ఈ అవినీతి వ్యవహారంలో ఉందనేది పబ్లిక్ టాక్. అధికారుల అండదండలు, అమాత్యుని ఆశీస్సులతో ఉపాధి సిబ్బంది అవినీతి ఆటలో చెలరేగి ఆడారు అంటే నమ్మి తీరాల్సిందే. గతంలో ఏపీడిగా పనిచేసిన ఒక అధికారి అవినీతి వ్యవహారాల గురించి అగ్ని కథనాలు ఇచ్చింది. దీనితో ఆయన్ని ఇక్కడి నుండి మార్చారు తప్పా ,సస్పెన్షన్ వంటి చర్యలు తీసుకోలేదు. ఇక తాజాగా మట్టి రోడ్ల నిర్మాణంలో అవినీతి శివతాండవం చేసిందంటే ముక్కున వేలేసు కోవాల్సిందే. గ్రామాల్లో మెటల్ రోడ్డు వేసేందుకు ఉపాధి హామీ పథకం కింద ఒక్కో పనికి దాదాపు తొమ్మిది లక్షల రూపాయలను కేటాయించారు. ఈ పనిలో 50 శాతం నిధులు కేవలం కూలీలకు చెల్లించాలి, మిగతా 50 శాతం నిధులే మట్టికి ఇతర మెటీరియల్ కి వినియోగించాలి. అయితే ఇక్కడ చేసిన పనుల్లో కూలీలకు ఇచ్చింది నామ మాత్రమే. జెసిబి లతో పని పూర్తి చేయించి మమ అనిపించారు.తొమ్మిది లక్షల్లో రెండు లక్షలు కూడా ఖర్చు పెట్టకుండా దాదాపు 7 లక్షలు బొక్కేశారు. అలా ఒక్క త్రిపురాంతకం మండలంలోనే 60 రోడ్లు వేసినట్లు సమాచారం. ఏపిడి పరిధిలో ఉండే ఏడు మండలాల్లో ఈ లెక్కన ఎన్ని పనులు జరిగాయి? ఎన్ని లక్షలు బుక్ చేశారు? అనేది ఆ లెక్కలు చూసిన అధికారులకే ఎరుక..! అయితే ఆడిటింగ్ అధికారులు తమ చేతివాటం చూపించి కొన్నింటిని ఓకే చేయడము, మరి కొన్నిటిని క్వాలిటీ కంట్రోల్ కు పంపించడం ఇక్కడ చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలోనే అవినీతి వ్యవహారం బయటికి పొక్కింది. ఆడిటింగ్ అధికారులను ప్రసన్నం చేసుకునేందుకు ఫీల్డ్ అసిస్టెంట్లు లక్షల్లో చేతులు మార్చినట్లు పక్కా సమాచారం. అలా పని కాని వారు ఇప్పుడు క్వాలిటీ కంట్రోల్ వద్ద మొరపెట్టుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇది త్రిపురాంతకం మండలం ఉదంతం..ఇక యర్రగొండపాలెం,పెద్దారవీడు,పుల్లల చెరువు మండలాల్లో ఉపాధి హామీ పథకం లో అవినీతి అనకొండ ల వ్యవహారం కాస్తా పెద్ద సంఖ్యలో ఉన్నట్లు తెలుస్తోంది.త్వరలో మరింత సమాచారం తో మరో కథనం..!

## కలెక్టరమ్మ కనికరించు...!

తోలటం లేదు. ట్యాంకర్ల ద్వారా నీళ్లు ఎందుకు తోలటం లేదో ఇప్పటికీ మాకు అర్థం కాలేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. వాటర్ డిపార్ట్మెంట్ చెందిన అసిస్టెంట్ ఏఈ శ్రీకాంత్ కు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా గ్రామం వైపు కూడా చూడలేని స్థితిలో, స్పందించలేని స్థితిలో మాటలకు మాత్రమే పరిమితమై ఎస్సీ కాలనీ లో ఉన్న సమస్యను గాలికి వదిలేశాడు. ఇప్పటికైనా స్పందిస్తాడో లేదో సమస్యను పరిష్కరిస్తాడు లేదా గాలికి వదిలేస్తాడు వేచి చూడాలి. గ్రామంలో ఉన్న సర్పంచ్ వాడాల పద్మ కు ఎస్సీ కాలనీలో నీటి సమస్యను తన దృష్టికి తీసుకువెళ్లిన ఇప్పటివరకు కూడా స్పందన కరువైంది. గుర్రపుశాల ఎస్సీ పాలెం లో కూడా నీటి కోసం గంటలు తరబడి ఎదురుచూస్తున్నఎస్సీ పాలెం ప్రజలు ఏదేమైనా మా పంచాయతీలో ప్రధానమైన నీటి సమస్యను తీర్చాలని ఎన్నిసార్లు అధికారులకు నాయకులకు చెప్పిన పట్టించుకునే నాధుడు లేడు పై అధికారులు స్పందించి వెంటనే మాకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని గ్రామంలోని ప్రజలు కోరుతున్నారు.




## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా వ్యవహరించండి

**- ఎస్ఐ మధుసూదన్ రావు**

అగ్ని న్యూస్, కొమరోలు:మండల ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని సబ్ ఇన్స్పెక్టర్ మధుసూదన్ రావు విజ్ఞప్తి చేశారు. ఇటీవల సైబర్ నేరాలు అధికమయ్యాయని, ఓటిపి మోసాలతో పాటు, మీరు బంపర్ డ్రా గెలుచుకున్నారని, బహుమతులు గెలుచుకున్నారని కోన్ బనేగా కరోడ్ పతి లో 25 లక్షలు గెలుచుకున్నారని వాట్సాప్ లో వస్తున్న మెసేజ్ లను చూసి మోసపోవద్దని,ఇటీవల పెట్టుబడుల పేరుతో ప్రముఖ కంపెనీల పేర్లను అడ్డం పెట్టుకొని మోసం చేస్తున్నారని తెలిపారు. టెలిగ్రామ్ చానల్స్ లో పెట్టుబడి పెడితే పెట్టిన పెట్టుబడి కన్నా అధిక మొత్తంలో లాభాలు పొందవచ్చని ఆశ చూపిస్తూ వారిని మోసం చేస్తున్నారని,అపరిచిత యాప్ లింక్ లు, ఆధార్ అప్డేట్ వంటి మోసాలు జరుగుతున్నాయన్నారు.కాబట్టి ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. అలానే ఉద్యోగాలు ఇప్పిస్తామని జరుగుతున్న మోసాలను దృష్టిలో ఉంచుకొని ప్రలోభాలకు లోను కాకుండా ప్రజలు సమయస్ఫూర్తిగా వ్యవహరించాలని ఎస్ఐ మధుసూదన్ రావు ప్రజలకు సూచించారు. ఎవరైనా సైబర్ నేరాల బారిన పడితే 1930 నెంబర్ కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. 24 గంటల్లోపు ఫిర్యాదు చేస్తే మీరు పోగొట్టుకున్న నగదును కోల్పోకుండా ఆన్లైన్లో నిలుపుదల చేసి తిరిగి నగదు వచ్చేలా చర్యలు తీసుకుంటారని వెల్లడించారు.

## కోడి పందెంరాయుళ్ళ ను పట్టుకున్న అరెస్టు చేసిన ఎస్ఐ మధుసూదన్ రావు



అగ్ని న్యూస్, కొమరోలు : మండలంలోని చింతలపల్లె అడవి ప్రాంతంలో కోడిపందాలు నిర్వహిస్తున్న వారిపై పోలీసులు ఆకస్మిక దాడులు చేశారు. పందేలు ఆడుతున్న పందెం రాయుళ్ళను పట్టుకొని 7 కోళ్లను, 4500 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా కొమరోలు ఎస్సై మధుసూదన్ రావు మాట్లాడుతూ చట్ట విరుద్ధమైన కార్యకలాపాలకు సంబంధించి మీకు ఏదైనా సమాచారం ఉంటే 100కు సమాచారం ఇవ్వాలని కోరారు. వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

# ఆ సచివాలయాలను పాత ఎమ్మార్వో కార్యాలయ ఆవరణలోకి మార్చండి



అగ్ని న్యూస్,గిద్దలూరు: నగర పంచాయతీలోని 1,2 సచివాలయాలను గిద్దలూరు పాత ఎమ్మార్వో కార్యాలయం ఆవరణలోకి మార్చాలని ప్రజాసంఘాల నాయకులు గిద్దలూరు నగర పంచాయతీ ఇన్చార్జి కమిషనర్ కు వినతిపత్రం అందజేశారు. నగర పంచాయతీలోని ఒకటవ సచివాలయం రెండవ సచివాలయం గణేష్ నగర్ లోని బి ఐ ఓ బ్యాంకుపై మూడో అంతస్తు పై ఉండడంతో ఆ సచివాలయం పరిధిలో ఉన్న ప్రజలు ప్రభుత్వ సేవల కోసం సచివాలయం దగ్గరికి వెళ్ళాలంటే వృద్ధులు వికలాంగులు సీనియర్ సిటిజన్స్ ఇబ్బందులు పడుతున్నారని ఆ రెండు సచివాలయాలను గిద్దలూరు పాత ఎమ్మార్వో కార్యాలయంలోకి మార్చాలని ప్రజాసంఘాల నాయకులు టి ఆవులయ్య, డి థామస్, బి నరసింహులు గిద్దలూరు నగర పంచాయతీ కమిషనర్ కు విన్నవించారు.పెద్ద మార్కెట్ వెనుక ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో కి మరో సచివాలయాన్ని మార్చవచ్చని ఈ మూడు ప్రాంతాలలో సచివాలయాలు పెడితే ప్రభుత్వానికి ఆదాయం మార్గం ఉంటుందని అద్దెలు కట్టకుండా ప్రభుత్వ భవనాల్లో సచివాలయాలు నడుపు కోవచ్చు అని అన్నారు.ఈ అంశంపై గిద్దలూరు నగర పంచాయతీ అధికారులు రెవిన్యూ అధికారులు సమన్వయం చేసుకొని సమస్యను సానుకూలంగా పరిష్కరించాలని కోరారు. కమిషనర్ స్పందిస్తూ సమస్యను సానుకూలంగా పరిశీలించి పరిష్కారం చేస్తామని అన్నారు.

# ఆర్టీసీ బస్టాండు... అపరిశుభ్రత కు ఆనవాళ్లు



అగ్ని న్యూస్,మార్కాపురం: డివిజన్ కేంద్రమైన మార్కాపురం లో ఉన్న ఆర్టీసీ బస్టాండ్ కు అన్ని ఎక్కువే అంటున్నారు ప్రయాణికులు.బస్టాండ్ ఆవరణలో అపరిశుభ్రత ఎక్కువే,క్యాంటీన్లలో అధిక ధరలు ఎక్కువే,ప్రయాణికుల పట్ల సిబ్బంది చీదరింపులు ఎక్కువే, బస్టాండ్ ఏర్పాటు చేసి గడిచిన సంవత్సరాలు ఎక్కువే, ఆవరణలో దొంగతనాలు ఎక్కువే. అంతేకాక ప్రయాణికుల కోసం ఏర్పాటుచేసిన తిరగని ఫ్యాన్లు ఎక్కువే, సిబ్బంది నిర్లక్ష్యం మరి ఎక్కువే, గోశాలను మరిపించే గోవులు ఈ బస్టాండ్ లో ఎక్కువే. బస్టాండులో స్లాబు పెంకులు ఊడిపడడం ఎక్కువే, ఊడి పడిన స్లాబ్ పెంకుల ద్వారా గాయపడిన ప్రయాణికులు ఎక్కువే, సంక్రాంతి దసరా పర్వదినాలలో సీజన్ టికెట్ల ధరలు కూడా ఎక్కువే. కనీస సౌకర్యాలు లేని నాణ్యత లేని బస్సులు, చీకటి పడితే మందుబాబుల బెడద,గంజాయి కొట్టి దొంగతనాలు చేసే వారి సంఖ్య తో పాటు బస్టాండులో వెలగని దీపాలూ ఎక్కువే. చినుకుపడ్డ చిత్తడి గా మారే ఆవరణం, ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసినబస్టాండ్ లోని మరుగు దొడ్లలో సులభ ధరలు ఎక్కువే. ఇలా ఒకటేంటి వెనకబడ్డ పశ్చిమ ప్రకాశం డివిజన్ కేంద్రమైన మార్కాపురానికి అన్ని ఎక్కువేనని ప్రయాణికులు అంటున్నారు.



# అక్రమ తొలగింపులు సరికాదు

## - తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

అగ్ని న్యూస్,మార్కాపురం: ఏపీ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ మాట్లాడుతూ మధ్యాహ్నం భోజన పథక నిర్వాహకులుగా గత 23 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న కార్మికులను అకారణంగా రాజీనామా చేయమని బలవంతం చేస్తూ, బెదిరించి రాజీనామాలు చేయిస్తున్నారని అన్నారు. గతంలో మధ్యాహ్నం భోజన కార్మికులు తమ సమస్యలపై ఆందోళన చేసిన సందర్భంలో మా ప్రభుత్వం అధికారంలో వచ్చిన వెంటనే చిరుద్యోగుల సమస్యలన్నీ పరిష్కరిస్తామని వేతనాలు పెంచుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీ ఇవ్వడం జరిగిందని అధికారంలోకి వచ్చిన తర్వాత సమస్యలు పరిష్కరించకపోగా ఉన్న ఉపాధిని ఊడగొట్టే చర్యలకు పూనుకోవటం విచారకరమని ఆయన అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిరు ఉద్యోగులను ఎవరిని తొలగించే విధానం మాది కాదు అని ప్రకటించారు. కానీ క్షేత్రస్థాయిలో కొందరు నాయకులు చిరు ఉద్యోగులను తొలగిస్తున్నారని 22 సంవత్సరాలుగా పాఠశాలలో పిల్లలకు భోజనం వండి, వడ్డిస్తున్నామని, ప్రభుత్వం సరైన సమయానికి వేతనం ఇచ్చిన ఇవ్వకపోయినా, అప్పులు చేసి సైతం పిల్లలకు అన్నం పెట్టామని ఇప్పుడు మమ్మల్ని అకారణంగా తొలగిస్తే మేము ఎలా బతకాలి అని వారి సమస్యను మొరపెట్టుకున్నారు. తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ కు వినతిపత్రం అందజేసి సమస్యను వివరించారు. స్పందించిన సబ్ కలెక్టర్ వెంటనే సంబంధిత అధికారులు పిలిపించి మాట్లాడతానని, కలెక్టర్ దృష్టికి విషయం తీసుకెళ్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు జె నాగరాజు, మిడ్ డే మిల్స్ యూనియన్ నాయకులు సుబ్బలక్ష్మమ్మ, ఈశ్వరమ్మ, బాలనాగమ్మ, కొండమ్మ, తిరుపతమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించండి - బీజేపీ



అగ్ని న్యూస్,మార్కాపురం: గత మూడు నెలలుగా భవన నిర్మాణ కార్మికులు పనులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారి సమస్యకు పరిష్కారాన్ని చూపించాలని కోరుతూ సబ్ కలెక్టర్ కార్యాలయం నందు సబ్ కలెక్టర్ రాహుల్ మీనా కు భారతీయ జనతా పార్టీ నాయకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఇసుక సమస్య ఏర్పడడంతో భవన నిర్మాణ కార్మికులకు పనులు లేక నానా యాతనలు పడుతున్నారని అన్నారు. గత ప్రభుత్వం ఇసుకను అధిక ధరకు అమ్మడంతో భవన నిర్మాణాలు నిర్మించుకునే యజమానులు కట్టడాలను నిలిపివేశారని, ప్రస్తుత ఎన్ డి ఏ ప్రభుత్వం ఉచిత ఇసుక ఏర్పాటు చేసినప్పటికీ సరైన సమయానికి ఇసుక రాకపోవడంతో గృహ నిర్మాణాలు నిర్మించుకునే వారు నిర్మించు కోకపోవడంతో కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సబ్ కలెక్టర్ నుకలిసి వినతిపత్రం అందచేసిన వారిలో మీడియా ఇన్చార్జి రామకృష్ణ తదితరులున్నారు.

ప్రపంచం ఇప్పుడు మీ చేతిలో :

అగ్ని దిన పత్రికలో మీ ఇష్టమైన వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలపండి

కేవలం 499/- మాత్రమే only soft copy



# మధ్యాహ్న భోజనానికి డొక్కా సీతమ్మ పేరు అభినందనీయం

అగ్ని న్యూస్,మార్కాపురం: రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకానికి డొక్కా సీతమ్మ పేరు పెట్టడం అభినందనీయమని ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షులు తాళ్ళపల్లి సత్యనారాయణ తెలిపారు. కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహింబడు మధ్యాహ్న భోజన కార్యక్రమంలో భాగంగా సోమవారం మార్కాపురం పట్టణ బాలుర ఉన్నత పాఠశాలలో శిక్షా సప్తాహ్-శుభ్ దిన్ భోజన్ కార్యక్రమంలో భాగంగా దాత ఆర్యవైశ్య ప్రముఖులు మాజీ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు తాళ్ళపల్లి సత్యనారాయణ సహకారంతో 957 మంది పిల్లలకు భోజన సమయంలో అరటిపండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 శ్రీనివాసరావు, జిల్లా బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మునగాల చంద్రశేఖర్ రెడ్డి,బొంతల హరికృష్ణ పాల్గొన్నారు.

# ఘనంగా ఏపీయూడబ్ల్యూజే విశాఖ జిల్లా మహాసభలు




సీనియర్ జర్నలిస్ట్ నిమ్మరాజుకు సత్కారం

అగ్ని న్యూస్,విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఏపీయూడబ్ల్యూజే) విశాఖపట్నం జిల్లా మహాసభలు గోపాలపట్నం లోని కుమారి కల్యాణ మండపంలో సోమవారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్ నిమ్మరాజు చలపతిరావును యూనియన్ నాయకులు, సభ్యులు సత్కరించారు. 2001-02 సంవత్సరాల్లో నిమ్మరాజు విశాఖలో ఆంధ్రభూమి బ్యూరో చీఫ్ గా పనిచేశారు. అదే కాలంలో యూనియన్ ఉమ్మడి రాష్ట్ర కార్యదర్శిగా, అక్రెడిటేషన్ కమిటీ సభ్యునిగా బాధ్యతలు నిర్వర్తించారు. యూనియన్ సీనియర్ నేత ఎం.ఆర్.ఎన్ వర్మ కన్వీనర్ గా విశాఖ అర్బన్ కమిటీని ఏర్పాటు చేసి, అప్పట్లో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యంగా సుదీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న జర్నలిస్ట్, నాన్ జర్నలిస్ట్ ఇళ్ల స్థలాల సమస్యలను నాటి జాయింట్ కలెక్టర్ ఎం.టి.కృష్ణబాబు దృష్టికి తీసుకెళ్లి, కొంతమేర పరిష్కారానికి కృషి చేశారు. జర్నలిస్టులపై దాడులు జరిగినపుడు అప్పటి నగర పోలీస్ కమిషనర్ ఎ.కె ఖాన్ దృష్టికి తీసుకెళ్లి,దోషులకు శిక్షపడేలా చేశారు. ఆంధ్రజ్యోతి పత్రిక మూతబడిన సందర్భంలో జర్నలిస్టులు, ఉద్యోగులకు మద్దతుగా ర్యాలీలు, ధర్నాలు నిర్వహించారు.ఈ సందర్భంగా నాడు ఆంధ్రభూమి లో నిమ్మరాజుతో కలిసి పనిచేసిన, నాడు కొత్తగా నియమితులై నేడు వివిధ పత్రికల్లో పనిచేస్తున్న జర్నలిస్టులు పలువురు నాటి మధుర జ్ఞాపకాలను ఓసారి మననం చేసుకుంటూ చలపతిరావును అభినందించారు.రాష్ట్ర సమాచార శాఖ ప్రస్తుత అదనపు డైరెక్టర్ఎల్.స్వర్ణలత నాడు డిప్యూటీ డైరెక్టర్ గా జర్నలిస్టు మిత్రులకు ఎంతో తోడ్పాటు అందించారని ఈ సందర్భంగా పలువురు కృతజ్ఞతలు ప్రకటించారు.ఈ మహాసభల్లో ఐజేయు కార్యదర్శి డి.సోమసుందర్,ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐ.వి సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి చందు జనార్దన్,ఐజేయు కార్యవర్గ సభ్యుడు, సామ్నా రాష్ట్ర అధ్యక్షుడు నల్లి ధర్మారావు, ఎలక్ట్రానిక్ మీడియా విభాగం అధ్యక్షుడు ఏచూరి శివ, సీనియర్ నేత ఎం.ఆర్.ఎన్ వర్మ, జిల్లా మాజీ అధ్యక్షుడు కే రాము, విశాఖ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.రామచంద్రరావు, కె.చంద్రమోహన్, కోశాధికారి కిల్లి ప్రకాశరావు, స్థానిక నాయకులు వాల్మీకి నాగరాజు, డి.హరనాథ్, జి.అచ్యుతరావు, కె.చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.




# సామాజిక భాగస్వామ్యం తో విద్యార్థులకు విందు భోజనం

అగ్ని న్యూస్,యర్రగొండపాలెం : శిక్షా సప్తాహ (విద్యావారోత్సవాలు) లో భాగంగా చివరిరోజు సామాజిక భాగస్వామ్య దినోత్సవం రోజు(తిథి) విందు భోజనం తో సంపూర్ణంగా ముగించినట్లు ఎంఈఓ పి ఆంజనేయులు తెలిపారు.కొత్తపల్లి ఎంపీ యుపిఎస్ లో ముఖ్య అతిధిగా హాజరై తిథి భోజన్ , సహపంక్తి భోజనం ఆవశ్యకత , ఉద్దేశ్యం వివరించారు.పాఠశాలలో ప్రస్తుతం మధ్యాహ్న భోజనం అమలు జరుగుతున్నప్పటికీ గ్రామస్తులు పాఠశాలలకు రావడం, మధ్యాహ్న భోజనం రుచి చూడటం వలన విద్యావ్యవస్థపై వారికి ఒక మంచి అవగాహన, నమ్మకం ఏర్పడుతుందన్నారు.మండలం లోని దాదాపు 55 పాఠశాలలో దాతలు ముందుకు వచ్చి, మంచి రుచికరమైన భోజనం (పాయసం,పెరుగు, చికెన్ పలావ్, అరటి పండ్లు,స్వీట్లు) వండించి వడ్డించి సహకరించటం ,శుభ పరిణామమని అన్నారు.యం ఈ ఓ ఆంజనేయులు, దాతలు సుబ్బారావు, అచ్యుత రావు, వెంకటేశ్వర్లు, లక్ష్మి, మల్లీశ్వరి,లాలాజ్యోతిలతో కలసి జి పి ఎస్ తిరుమల గిరి, వై పాలెం బిసి, ఎస్సీ, అంబేద్కర్ నగర్, కొత్త పల్లి పాఠశాలలో డొక్కా సీతమ్మ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించి ఆమె సేవలు కొనియాడారు. ప్రభుత్వం పాటశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి డొక్కా సీతమ్మ పేరు పెట్టడం అభినందనీయం అన్నారు.జి పి ఎస్ తిరుమలగిరి కాలనీలో ఎం జి ఓ ఆంజనేయులు స్వచ్ఛందంగా విద్యార్థులకు ప్రత్యేక విందు భోజనం ఏర్పాటు చేయించి విద్యార్థులకు వడ్డించారు. వంటలక్క సిహెచ్ అల్లూరమ్మ ను పూలదండ, శాలువాతో సన్మానించారు. ఎంపీపీ ఎస్ బీసీ , సి పాలెం లలో ప్రత్యేక భోజనం ఏర్పాటు చేయించిన గోళ్ల వెంకట సుబ్బారావుని పూలదండ ,.శాలువాతో సన్మానించారు. యర్రగొండపాలెం అంబేద్కర్ నగర్ లో అచ్యుతరావు, వీరభద్రాపురం జడ్పీహెచ్ఎస్ , ఎంపీపీ ఎస్ మెయిన్, పాఠశాలలలో ఎంపీటీసీ సభ్యులు పసుపులేటి వెంకటనారాయణ ప్రత్యేక భోజనం ఏర్పాటు చేసి తమ ఉదారత చాటుకున్నారు.మరో ఎంఈఓ మల్లు నాయక్, గంజివారి పల్లి ఎంపీపీ ఎస్ (ఎస్సీ) నందు పాల్గొని మాట్లాడుతూ మనకు చేతనైనంతలో సహాయం చేయాలనీ, విద్యార్థుల బాగోగుల గురించి ఆలోచించే తల్లిదండ్రులు వుండటం అభినంద నీయమని ,అలా లేని చోట్ల ఉపాధ్యాయులే పిల్లలకు తమ స్వంతంగా ప్రత్యేక భోజనం చేయించటం హర్షణీయమని అన్నారు. ప్రధానోపాధ్యాయులు వెంకటరెడ్డి ప్రత్యేకంగా భోజన ఏర్పాటు చేయటం ఎందరికో ఆదర్శనీయమన్నారు.స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన దాతలు మాట్లాడుతూ మా గ్రామంలోని పిల్లలందరూ మా పిల్లలు గానే భావిస్తామని ఇలాంటి కార్యక్రమాలు చేయటానికి ఎప్పుడూ ముందుండటానికి మా సహకారం ఎప్పుడూ వుంటుందనీ తెలియచేశారు.మండలంలో ఈ వారం రోజులు కార్యక్రమాలు చక్కగా నిర్వహించి , విద్యార్థులలో సృజనాత్మక ధోరణి పెంపొందింప చేసిన ఉపాధ్యాయులకు , సహక రించిన ప్రధానోపాధ్యాయులకు ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థినీ విద్యార్థులకు , నేడు శుభ దిన్ భోజన్ కు స్వచ్ఛందంగా సహకరించిన దాతలకు, తల్లితండ్రులు అందరికీ అభినందనలు తెలియచేశారు.

# విద్యార్థినులకు క్యాన్సర్ పై అవగాహన




అగ్ని న్యూస్,మార్కాపురం: పట్టణంలోని రెడ్డి మహిళా కళాశాలలో బాలికలకు సోమవారం క్యాన్సర్ పై లక్ష్మీ చెన్నకేశవ వికాస తరంగిణి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. అనంతరం బాలికలకు ఉచిత సానిటరీ న్యాప్ కిన్స్ ను వికాస తరంగిణి సభ్యులు అందించారు.

అగ్ని దిన పత్రికలో మీ ఇష్టమైన వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలపండి
కేవలం 499/- మాత్రమే only soft copy



# గొర్రెల షెడ్ల నిర్మాణానికి రాయితీని 90 శాతానికి పెంచాలి

- మున్సిపాలిటీలో ఉన్న గొర్రెల కాపరులకు పథకాన్ని వర్తింపజేయాలి

అగ్ని న్యూస్, చీమకుర్తి: గొర్రెల షెడ్లు నిర్మాణానికి 90 శాతానికి రాయితీని పెంచి మున్సిపాలిటీలో ఉన్న గొర్రెల కాపరులకు పథకాన్ని వర్తింపజేయాలని ఏపీ గొర్రెలు, మేకల పెంపకం దారుల సంఘం ప్రకాశం జిల్లా కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్పందన కార్యక్రమంలో చీమకుర్తి మండల అభివృద్ధి అధికారి ఎండిఓ, యంఆర్వో లకు వినతి పత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కార్యదర్శి కిలారి పెద్దబ్బాయి, జిల్లా కార్యదర్శి తోట తిరుపతిరావు, మాట్లాడుతూ పశువుల షెడ్లు నిర్మాణానికి రాయితీ ఇస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి కన్నబాబు జులై 1న ఉత్తర్వులు మార్గదర్శకాలు విడుదల చేయడం జరిగిందని పశువులకు 90 శాతం రాయితీ గొర్రెలకు 70 శాతం రాయితీ ఇస్తామని ప్రకటించారు. ఒకే పథకంలో రెండు రకాల రాయితీలు ఇవ్వడం ఏమిటని దీనికి ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. ఈ పథకంలో పశువులకు ఎక్కువ రాయితీ సన్న జీవాలకు తక్కువ రాయితీ ఇవ్వడం సరైనది కాదని పెంపకం దారుల పట్ల వివక్ష తగదని అన్నారు.గొర్రెల షెడ్లకు కూడా 90 శాతానికి రాయితీ ని పెంచాలన్నారు. అంతేకాకుండా నగర పంచాయతీ, మున్సిపాలిటీలలో వందలాది మంది గొర్రెల కాపర్లు అనేక సంవత్సరాలుగా వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఈ పథకంలో జాబ్ కార్డు ఉండాలని నిబంధన విధించడంతో మున్సిపాలిటీ లో ఉన్న గొర్రెల కాపరులకు ఈ పథకం వర్తించడం లేదని వీరంతా సన్నా చిన్న కారు రైతులేనని అందువల్ల వీరికి కూడా పథకాన్ని వర్తింప చేయాలన్నారు. మొత్తం జిల్లాలో ఈ పథకం ద్వారా 1075 యూనిట్లు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిందని జిల్లాలోని అన్ని గ్రామాలలో పశువులు, గొర్రెల రైతులు లక్షల సంఖ్యలో ఉన్నారని, ఆ ప్రకారం చూస్తే కొన్ని గ్రామాలకు ఒక్క యూనిట్ కూడా వచ్చే అవకాశం లేదని అర్థమవుతోందన్నారు. అందువలన ప్రచార ఆర్భాటం తప్ప పశువుల రైతులకు ఈ పథకం వల్ల ఏమాత్రం ఉపయోగం జరిగే అవకాశం లేదని అన్నారు. కనీసం గ్రామానికి పది యూనిట్లు చొప్పున మంజూరు చేయాలని, రాజకీయ ప్రమేయం లేకుండా అర్హత ఉన్న ప్రతి పెంపకం దారుడు కి, పశువుల రైతులకు, ఇవ్వాలని,పశు నష్టపరిహారం పెండింగ్ నిధులు వెంటనే విడుదల చేయాలని, పశు బీమా పథకాన్ని ఉచితంగా అమలు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల జిల్లా నాయకులు పూసపాటి వెంకట రావు, గొర్రెల ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షులు బొడ్డు రామ్మూర్తి, ఎం సుబ్బారావు, రావులపల్లి ఆంజనేయులు, ఎం శ్రీను, బి సురేంద్ర ,బి వెంకట స్వామి, సిహెచ్ కిష్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

# శిక్ష సప్తాహ్ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఎరిక్షన్



అగ్ని న్యూస్,దోర్నాల: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శిక్ష సప్తాహ్ లో భాగంగా ఏర్పాటు చేసిన శుభదిన్ భోజన్ కార్యక్రమంలో యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు పాల్గొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. అనంతరం విద్యార్థులకు స్వయంగా భోజనం వడ్డించి పెట్టారు. కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



## ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షలు



అగ్ని న్యూస్, అమరావతి: 2024-25 నుంచి అమలు చేయనున్న ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 పథకానికి సంబంధించిన మార్గదర్శకాలను కేంద్రం సవరించింది. ఇకపై ఇంటి నిర్మాణానికి అందించే ఈ మొత్తాన్ని రూ. 4,00,000 కు పెంచనుంది. అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు తమ వాటా నిధుల్ని కేటాయించాల్సిందేనని కేంద్రం స్పష్టం చేసింది. ఈ పథకం కింద కొత్తగా ఎంపిక చేసే లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ. 4 లక్షలు ఇవ్వనుంది. ఇందులో కేంద్రం తన వాటాగా రూ. 2.50 లక్షలు అందించనుంది. దీనిపై సీఎం చంద్రబాబు సోమవారం అధికారులతో సమీక్షించారు.

# సైబర్ నేరాలు, హెల్మెట్ పై ప్రజలకు అవగాహన



అగ్ని న్యూస్,కొనకనమిట్ల: ఎస్ఐ మాధవరావు సిద్ధరవం గ్రామ ప్రజలతో మమేకమై సోమవారం హెల్మెట్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఇటీవల సైబర్ నేరాలు అధికమయ్యాయని ఓటీపీ మోసాలతో పాటు బంపర్ డ్రా గెలుచుకున్నారని గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్లు చేసి మోసగిస్తున్నారని వీటి పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ద్విచక్రవాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, కారులో ప్రయాణించేటప్పుడు సీట్ బెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని ప్రజలకు ఎస్సై తెలిపారు.




# అధికారులతో సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే ముత్తుముల



అగ్ని న్యూస్,గిద్దలూరు: పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి నియోజకవర్గంలోని ఆరు మండలాల పంచాయతీ రాజ్, యానిమల్ హస్బెండరీ శాఖ అధికారులతో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో ఇప్పటి వరకు ఎటువంటి సమస్యలు పెండింగ్ లో ఉన్న తన దృష్టికి తీసుకొని రావాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో రాజీపడే ప్రశక్తే లేదని, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పరంగా పూర్తి సహకారం ఉంటుందన్నారు.

# వెలుగని వీధి దీపాలు



అగ్ని న్యూస్,గిద్దలూరు: నగర పంచాయతీ పరిధిలో గల శ్రీనివాస థియేటర్ ఎదురుగా సెల్ టవర్ కల ఏరియాలో వీధి దీపాలు వెలుగక ప్రజలు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే విధి దీపాలు వెలిగే విధంగా చేయాలని ప్రజలు కోరుతున్నారు.



RK అగ్ని న్యూస్ The Power Of Truth
30 మంగళవారం , జులై 2024

## శిక్ష సప్తాహ్ సందర్భంగా పాఠశాలల్లో శుభదిన్ భోజన్ కార్యక్రమం




అగ్ని న్యూస్,దోర్నాల: మండలంలోని వై.చర్లోపల్లి గ్రామం లోని ప్రభుత్వ పాఠశాల,ఎస్. సి.పాలెంలో నీ ప్రభుత్వ పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు గల విద్యార్ధిని విద్యార్డులకు సోమవారం శిక్ష సప్తాహ్లో భాగంగా ఏర్పాటు చేసిన శుభదిన్ భోజన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం,బట్టు నారాయణ రెడ్డి జ్ఞాపకార్థం బట్టు విద్యా సంస్థల ఛైర్మన్ బట్టు రమణా రెడ్డి, కరస్పాండెంట్ , టి ఎన్ టి యు సి ప్రదాన కార్యదర్శి బట్టు సుధాకర రెడ్డి ల అద్వర్యంలో పాటశాల విద్యార్డిని విద్యార్డులకు మంచి బోజనం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సందర్భంగా బట్టు రమణారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించి పాఠశాలల్లో అభివృద్ధికి తోడ్పాటు అందించే విధంగా నిర్వహిస్తుండటం ఎంతో గర్వకారణమైన విషయమనిఆయన తెలిపారు.ఈ కార్య క్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రదాన ఉపాధ్యాయులు బాల గురవులు ,బాధూర్ నాయక్ ఉషా ఇతర సిబ్బంది మరియుకుటమి నాయకులు ఒంటేరు రాఘవ,మూల నాగిరెడ్డి, సొంటి రామచంద్రుడు, కాశయ్య తదితరులు పాల్గోని కార్యాక్రమాన్ని విజయవంతం చేశారు.

## విత్తన దుకాణాలు తనిఖీ



అగ్ని న్యూస్,కొమరోలు: మండలంలోని పలు విత్తన దుకాణాలపై అంతర్గత తనిఖీల్లో భాగంగా కనిగిరి సహాయ వ్యవసాయ సంచాలకులు వెంకట రమణ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. స్టాక్ రిజిస్టర్లు,బిల్ బుక్కులు, రసీదులు, ప్రిన్సిపుల్ సర్టిఫికెట్స్ మొదలైనవి పరిశీలించి, విత్తన విక్రయదారులకు కొన్ని సూచనలు చేశారు. రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వవలెను, స్టాకు వచ్చినప్పుడు స్థానిక వ్యవసాయ అధికారికి సమాచారం ఎప్పటికప్పుడు ఇవ్వవలెనని, స్టాకు వచ్చినప్పుడు మొలక శాతం కట్టి తర్వాత రైతులకు అమ్మ వలెను. గడువు ముగిసిన స్టాక్ ను ఎప్పటికప్పుడు వేరు చేసి ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి కె.రాజశ్రీ పాల్గొన్నారు.




Printed, Published & Owned by K.V.RAMANA RAO, APTEL 0548/01/1997 SV Printers - Markapur.(K.Rama Krishna- 9441533080/ 8309890844)